

చర్యలే గమ్మత్తు..జోరుగా మత్తు

పశ్చిమ ప్రకాశంలో ఒక వైపు గంజాయి విక్రయాలు, మరో వైపు బెల్టుషాపులు జోరుగా సాగుతున్నాయి. అటవీ సమీప గ్రామాల్లో సారా బట్టీలు ఉన్నాయి. - 8లో..



పంచాయతీ కార్యదర్శి అత్యుత్సాహం

పొన్నలూరు మండలం చెరుకూరులో పొలాలకు వెళ్లే దారిని పంచాయతీ కార్యదర్శి అత్యుత్సాహంతో పొక్లెయిన్‌తో తవ్వించేశారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30/24

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సీఎం కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బుధ, గురువారాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించే కలెక్టర్ల సమావేశానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం వెళ్లారు. సీఎం నిర్వహించిన సమావేశంలో పాల్గొని జిల్లాకు సంబంధించిన అంశాలను చర్చించారు. గురువారం జరిగే సమావేశంలో కూడా కలెక్టర్ పాల్గొంటున్నారు.

స్విమ్మింగ్‌లో యోగిరాములు ప్రతిభ



సాధించిన మెడల్స్‌తో యోగిరాములు

దొనకొండ: గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో 7వ ఆల్ ఇండియన్ స్విమ్మింగ్ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కప్ పోటీలు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని చందవరం గ్రామానికి చెందిన కన్నెబోయిన యోగిరాములు ఏపీ తరఫున పాల్గొని గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. 4×100 ఫ్రీ స్టైల్ విభాగంలో గోల్డ్ మెడల్, 4×50 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. ఇంటర్నేషనల్ పోటీలకు సన్నద్ధమవుతున్నట్లు యోగిరాములు తెలిపారు.

పేదల గూళ్లపై అంతులేని నిర్లక్ష్యం



జగనన్న కాలనీల్లో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

మార్కాపురం పట్టణంలోని అర్హులైన పేదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇడుపూరు లేఔట్‌లో 6664 భవనాలు మంజూరు చేశారు. 1832 భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. గత ప్రభుత్వంలో విద్యుత్ కాంతులతో వెలుగులీనిన జగనన్న కాలనీ నేడు అంధకారంలో మగ్గుతోంది. మూడు నెలలుగా కాలిపోయిన బల్బుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. అలాగే ఇక్కడ సమస్యలు రాజ్యమేలుతున్నాయి.

పేద, మధ్య తరగతి ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చారు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. పేదింటి కోసం కొత్త ఊళ్లనే నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటుతున్నా కొత్త ఇళ్లు మంజూరు చేయకపోగా, నిర్మాణంలో ఉన్న ఇళ్ల బిల్లుల చెల్లింపులు చేయడంలేదు. అంతేకాదు జగనన్న కాలనీలను పట్టించుకోకపోవడంతో అవి సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. కాలనీల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సిస్టం, వీధిలైట్లు, తాగునీటి సౌకర్యంపై పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు.

- కూటమి ప్రభుత్వంలో మంజూరుకాని కొత్త ఇళ్లు
- జగనన్న కాలనీల అభివృద్ధిపైనా నిర్లక్ష్యం
- పశ్చిమ ప్రకాశంలో మంజూరైన గృహాలు 18,367
- పూర్తయినవి 7,289
- బిల్లుల చెల్లింపులో ఆలస్యం

మార్కాపురం: పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించి వారి కలను నెరవేర్చే దిశగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నాడు పేదలు సొంతిల్లు కోసం ఇంటికి దగ్గరలో ఉన్న సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే సచివాలయ సిబ్బంది పరిశీలించి వెంటనే మంజూరు చేసేవారు. దీంతో రాష్ట్రంలోని వివిధ గ్రామాల్లో కొత్త గ్రామాలు, కొత్త కాలనీలు, జగనన్న కాలనీలు, వైఎస్సార్ నగర్‌లు ఏర్పడ్డాయి. ఇంటి నిర్మాణానికి సుమారు రూ.1.80 లక్షల నగదుతోపాటు ఇంటి యజమానురాలు పొదుపు గ్రూపులో ఉంటే బ్యాంకు లింకేజీ రుణాన్ని కూడా ఇప్పించారు. దీంతో త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తికావడంతో ఈ ఏడాది సంక్రాంతి, ఉగాది పర్వదినాల్లో పలువురు గృహ ప్రవేశాలు చేశారు. నేడు పరిస్థితి భిన్నంగా ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి 6 నెలలైనా అర్హులైన పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదు. దీంతో అర్హులైన పేదలు పక్కా గృహాల మంజూరు కోసం ఎదురుచూస్తున్నారు. ఎప్పుడు కొత్త ఇళ్లు మంజూరవుతాయో కూడా తెలీదు. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణంలో కూడా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. కాలనీల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సిస్టం, వీధిలైట్లు, తాగునీటి సౌకర్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

పశ్చిమ ప్రకాశంలో మొత్తం 18,367 గృహాలు మంజూరు కాగా 7,289 గృహాలు పూర్తయ్యాయి. ఇందులో 55 గృహాలు ప్రారంభించకపోవడంతో అధికారులు నిలిపేశారు. మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. గత ప్రభుత్వంలో వెంటవెంటనే బిల్లులు చెల్లించడంతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేశారు.



మార్కాపురం జగనన్న కాలనీలో అర్ధంతరంగా నిలిచిన నిర్మాణాలు



జగనన్న కాలనీల్లో ఇళ్ల మధ్యనే పిచ్చిచెట్లు

కాలనీల్లో సౌకర్యాలు నిల్...

మార్కాపురం పట్టణ శివార్లలో నిర్మాణంలో ఉన్న ఇడుపూరు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వర్షాకాలంలో రోడ్లపైనే మురుగునీరు ఏర్పడి ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో చిల్లచెట్లు పడి ఇబ్బందికరంగా మారాయి. దీంతో రాత్రిపూట విషసర్పాలు తిరుగుతున్నాయి. పలు చోట్ల వీధిలైట్లు వెలగకపోవడంతో స్థానికులు అంధకారంలో ఉంటున్నారు. ఇప్పటికైనా గృహ నిర్మాణశాఖ అధికారులు జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

పశ్చిమ ప్రకాశంలో గత ప్రభుత్వంలో ఇలా...

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తైనవి
మార్కాపురం రూరల్	979	461
మార్కాపురం టౌన్	6421	815
తర్లుపాడు	918	521
దోర్నాల	474	191
పెద్దారవీడు	400	232
పుల్లలచెరువు	634	338
త్రిపురాంతకం	1109	453
యర్రగొండపాలెం	964	399
అర్ధవీడు	606	353
బేస్తవారపేట	1086	507
కంభం	949	589
గిద్దలూరు	868	538
గిద్దలూరు టౌన్	1452	923
కొమరోలు	942	527
రాచర్ల	565	434

కనీస సౌకర్యాలు కల్పిస్తాం

జగనన్న కాలనీల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, వీధిలైట్లను ఏర్పాటు చేస్తాం. కొన్ని చోట్ల తాగునీటి సౌకర్యం కూడా కలించాం. బిల్లుల చెల్లింపు కూడా చేస్తున్నాం. లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా చూస్తాం.

– పవన్‌కుమార్, డీఈ హౌసింగ్, మార్కాపురం

స్త్రీనిధి, ఉన్నతి రికవరీలు నూరు శాతం చేయాలి

- పీడీ వసుంధర



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

ఒంగోలు వన్‌టౌన్: స్త్రీ నిధి, ఉన్నతి రికవరీలు నూరు శాతానికి తీసుకురావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టీ వసుంధర అన్నారు. ఒంగోలు భాగ్యనగర్‌లోని టెక్నికల్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న ఏరియా కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ అన్ని బ్యాంకు బ్రాంచిల్లో ఎన్‌పీఏ గ్రూపులను రెగ్యులర్ చేయాలని, అర్హత ఉన్న అన్ని స్వయం సహాయక గ్రూపులకు బ్యాంక్ లింకేజీ ఏర్పాటు చేసి యూనిట్లు నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని స్వయం సహాయక గ్రూపులు, ఎంఎఎస్‌ల గ్రేడింగ్ నిమిత్తం ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఈ నెలఖరు లోపు అన్ని గ్రూపులను ఏ గ్రేడ్‌లోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఎస్‌డీఎం మాట్లాడుతూ ఎంపిక చేసిన యూనిట్లు అన్నింటికీ అర్హతలు, సిబిల్ స్కోర్‌లను పరిశీలించి యూనిట్లను గ్రౌండింగ్ చేస్తామన్నారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఏజీఎం మాట్లాడుతూ బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో 'అమృత సరోవర్'

- డ్వామా పీడీ జోసెఫ్ కుమార్



మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ జోసెఫ్ కుమార్

మార్కాపురం రూరల్: మండలంలోని ప్రతి పంచాయతీలో అమృతసరోవర్ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీ జోసెఫ్ కుమార్ అన్నారు. మండలంలోని రాయవరం సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరా నుంచి ఐదెకరాల చెరువులను అభివృద్ధి చేయాలని, చిల్లచెట్లు తొలగించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, చెరువుకట్టను శుభ్రపరిచి చెట్లు నాటి వాకర్స్ బెంచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపు ప్రకారం పనులు గుర్తించిన ప్రణాళికను ఈనెల 18లోపు పూర్తిచేయాలని అన్నారు. ప్రతి పంచాయతీలో ఒక ఫాంపాండ్ ఫీల్డు అసిస్టెంట్ల వారీగా జనవరి 14 లోపు చేయించాలని అన్నారు. ప్రతి టీఏ ఒక రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ జనవరి 14లోపు పూర్తిచేయాలన్నారు. ప్రతి సంవత్సరంలో 50 నుంచి 100 మంది పనులు చేయకుండా హాజరువేసినా అప్పటికప్పుడే విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తామని హెచ్చరించారు. నూతన ఆదేశాల ప్రకారం లక్ష రూపాయలు రికవరీ వస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కాపురం క్లస్టర్ ఏపీడీ నిర్మలాదేవి, ఒంగోలు డీబీటీ నాగేశ్వరరావు, మార్కాపురం ఏపీఓ జీవరత్నం, దోర్నాల, దొనకొండ, పెద్దారవీడు, పుల్లలచెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం క్లస్టర్ మండలాల్లోని ఏపీఓలు, ఈసీలు, టీఏలు, సీఓలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

రైతుల జైలుపాలు...ఎవరిదీ పాపం?

- ఫోర్జరీ ఆన్‌లైన్ పత్రాలపై కదులుతున్న డొంక
- ఉలిక్కిపడిన రెవెన్యూ ఉద్యోగులు
- మీసేవ కేంద్రాలు, వీఆర్‌ఓల పాత్రపై ఆరా
- గొట్లగట్టు బ్యాంకులో 300 మంది రైతులకు రుణాలు

పొదిలి: భూములకు సంబంధించి అవసరమైన పత్రాల జారీలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం, అవినీతి రైతుల పాలిట శాపంగా మారింది. భూమిపై రుణాలు పొందాలంటే తప్పని సరిగా రికార్డులు అవసరం కనుక రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి వేసారిపోతున్నారు. అయినా పని కాకపోవటంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. కొంత మంది మీసేవా కేంద్రాల నిర్వాహకులు, నెట్ సెంటర్ నిర్వాహకులు, రెవెన్యూ ఉద్యోగులు రైతులను అడ్డదారి తొక్కించి పనులు చేస్తున్నారు. ఫోర్జరీ పత్రాలతో గొట్లగట్టు బ్యాంకులో రుణాలు పొందిన ముగ్గురు రైతులు మంగళవారం జైలుపాలు కావటంతో రెవెన్యూ ఉద్యోగులు ఉలిక్కి పడ్డారు. ఈ వ్యవహారంలో లోతుగా విచారణ జరిపితే చాలా మంది ఇరుక్కుంటారనే ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి ఆ ముగ్గురు రైతులకు సంబంధించి రుణం తీసుకున్న భూమి వారి సొంతమే. అయితే రికార్డుపరంగా ఆన్‌లైన్ కాలేదు. దీంతో ఆన్‌లైన్ కోసం మీసేవా కేంద్రం వారిని, ఇంటర్‌నెట్ వారిని సంప్రదించారు. అదే అవకాశంగా భావించిన వీరు రైతుల వద్ద డబ్బులు గుంజుకుని ఫోర్జరీ పత్రాలు చేతిలో పెట్టారు. అవి ఫోర్జరీ పత్రాలని బాధిత రైతులకు కూడా తెలియదని తోటి రైతులు చెబుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం వారు రైతులకు వారి భూములకు సంబంధించి పత్రాలు సకాలంలో అందజేస్తే, ఇటువంటి సంఘటనలు జరిగే అవకాశం ఉండదు. మరో వైపు గొట్లగట్టు బ్యాంకులో ఇలా రుణాలు పొందిన రైతులు సుమారు 300 మంది వరకు ఉంటారనే అంచనాలు వేస్తున్నారు. దీని వెనుక ఒక వీఆర్‌ఓ పాత్ర కీలకంగా ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. ఫోర్జరీ సంతకంపై ఫిర్యాదు చేసినప్పటి నుంచి బ్యాంకులో రైతుల రుణాల రికవరీ వేగంగా ఉందని చెబుతున్నారు. విషయం బయటపడక ముందే రుణాలు చెల్లించేందుకు కొందరు రైతులు ముందుకొస్తున్నారు. పోలీసుల విచారణలో తీగ లాగితే డొంక కదులుతున్నట్లుగా గుర్తించారు. అప్పుడే ఏమైంది, ముందు ముందు చాలా విషయాలు బయటకు వస్తాయని రైతులే వ్యాఖ్యానిస్తున్నారు. మరో వైపు రైతులు తమ పొలం పత్రాలని నమ్మి, రుణాలు పొంది, జైలు పాలు కావటంలో ప్రధాన పాత్ర రెవెన్యూ వారిదేనని, మిగిలిన పాత్ర మీ సేవా కేంద్రాలు, నెట్ సెంటర్లు వారిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సచివాలయాల్లో ఉన్న బార్ కోడ్ పేపరుపై ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారవుతున్నాయనే ఆరోపణలపై కూడా పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సి ఉంది. రెవెన్యూ శాఖ వారు రైతులకు అవసరమైన పత్రాలను ఆలస్యం లేకుండా ఇప్పటికైనా అందించాల్సిన అవసరం ఉంది. అప్పుడే రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ఉంటారు.

23 లోపు అంగన్‌వాడీల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సిటీ: జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసీడీఎస్ పీడీ కె.మాధురి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, 4 మినీ అంగన్‌వాడీ కార్యకర్త, 89 అంగన్‌వాడీ ఆయాల భర్తీకి ఈ నెల 11 నుంచి 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు సంబంధిత సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

31 లోపు ఫ్యాక్టరీ రన్నింగ్ లైసెన్స్ రుసుం చెల్లించాలి

ఒంగోలు సిటీ: జిల్లాలోని ఫ్యాక్టరీల యాజమాన్యం వారు 2025 సంవత్సరానికి ఫ్యాక్టరీ రన్నింగ్ లైసెన్స్ రుసుంను అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో చలానా రూపంలో చెల్లించాలని ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ ఒంగోలు 1, 2 శైలేంద్రకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాన్యువల్ రిటర్న్‌ను ఆన్‌లైన్‌లో ఏప్రిల్ లోపు పొందుపరచాల్సిందిగా కోరారు.

రేపు సీనియర్ మెన్ బాక్సింగ్ జిల్లా క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: సీనియర్ మెన్ బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 13న స్థానిక పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.ఉదయరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రం, 3 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, 3 సెట్ల నకలు కాపీలతో నేరుగా ఎంపికకు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు త్వరలో జరిగే 8వ రాష్ట్ర సీనియర్ మెన్ బాక్సింగ్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9703448827ను సంప్రదించాలన్నారు.


పొదుపు టోకరా రూ.50 లక్షలు

- ఎస్టీలే లక్ష్యంగా నందిని పొదుపు సంస్థ
- 10 నెలలుగా నిలిచిన సంస్థ కార్యకలాపాలు
- 800 మంది సభ్యులకు రావాల్సిన మొత్తం రూ.50 లక్షలు
- రెండు రోజులుగా పోలీస్‌స్టేషన్ వద్ద పంచాయితీ




సింగరాయకొండ పోలీస్‌స్టేషన్ వద్ద గుమికూడిన ఎస్టీలు

సింగరాయకొండ: ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారిని టార్గెట్ చేసుకొని ఏర్పాటైన పొదుపు సంస్థ బోర్డు తిప్పేసింది. దాదాపు 10 నెలలుగా సంస్థ కార్యకలాపాలు నిలిచిపోవడంతో కాయకష్టం చేసుకొని రూపాయి రూపాయి కూడబెట్టుకున్న పేదలంతా బయటకు వస్తున్నారు. సుమారు 800 మంది సభ్యులకు రూ.50 లక్షలకు పైగా చెల్లింపులు నిలిచినట్లు సమాచారం. దీంతో బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఎస్సై బి.మహేంద్రకు విన్నవించారు. వివరాల్లోకి వెళితే.. ఉలవపాడుకు చెందిన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన కామంచి కోటి 2016లో నందిని పొదుపు సంస్థను ప్రారంభించాడు. ఈ సంస్థకు తన సామాజికన వర్గానికి చెందిన వారితో వారానికి రూ.50 నుంచి రూ.200 చొప్పున 340 వారాలు కట్టించుకునేవాడు. ఈ ప్రకారం సంస్థలో 800 మంది సభ్యులు ఉన్నారు. మండలంతో పాటు ఉలవపాడు, కొత్తపట్నం, మడనూరు, కడవకదురు, కావలి, జలదంకి, చీమకుర్తి, అల్లూరు, మన్నూరు తదితర ప్రాంతాల్లోని ఎస్టీ కాలనీవాసులను సభ్యులుగా చేర్చుకుని వారి చేత పొదుపు కట్టించుకునేవాడు. అయితే మూడేళ్ల క్రితం కోటి క్యాన్సర్ వ్యాధితో మృతి చెందాడు. ఆ తరువాత పొదుపు సంస్థను అతని భార్య నందిని నిర్వహించేది. సంస్థలో సుమారు 15 మంది సిబ్బంది పనిచేసేవారు. అయితే గత 10 నెలలుగా సిబ్బంది మానేయడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీంతో బాధితులు ఏం చేయాలో అర్థం కాక మదనపడుతున్నారు. చివరికి మంగళవారం సమస్యను ఎస్సై బి.మహేంద్ర దృష్టికి తీసుకువచ్చారు. ఎస్సై సంస్థ ప్రతినిధి నందిని పిలిచి మాట్లాడారు. తిరిగి బుధవారం మండలంతో పాటు ఇతర మండలాల బాధిత ఎస్టీలు సుమారు 200 మందికి పైగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. దీంతో ఎస్సై మహేంద్ర ఈ మండలానికి చెందినవారు మాత్రమే ఉండాలని, మిగిలిన వారు మీ మండలాల్లో ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. ఆ ప్రకారం మండలానికి చెందిన బాధితులు 270 మందికి రూ.18 లక్షలు ఇవ్వాలని తేల్చారు. అన్ని మండలాలతో కలిపితే ఈ మొత్తం సుమారు రూ.50 లక్షలకు పైగా ఉండే అవకాశం ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. సంస్థ ప్రతినిధి నందిని మాత్రం తన స్థిరాస్తులు ఉన్నాయని, వాటిని అమ్మి బాధితులకు డబ్బులు చెల్లిస్తానని చెబుతోంది. ఈ ఘటనపై కేసు రిజిస్టరు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి. మహేంద్ర వివరించారు.



నందిని పొదుపు సంస్థ గుర్తింపు కార్డు

కాయకష్టం చేసి కట్టుకున్నాం



కాయ కష్టం చేసి రూపాయి రూపాయి కూడబెట్టుకున్నాం. కొన్ని నెలలుగా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. నా తల్లి సంజీవమ్మ పేరుపై రూ.3,500, కోడలు కొమరగిరి దివ్య పేరుపై కట్టిన రూ.15,500 రావాలి. రెండు రోజుల నుంచి పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాను.

– కత్తి రాజేష్, ఎస్టీ కాలనీ, బింగినపల్లి

14న నాదయోగ వార్షికోత్సవం



సంగీత విభావరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మండవ మురళీకృష్ణ

ఒంగోలు టౌన్: ఈ నెల 14వ తేదీ నగరంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించనున్న నాదయోగ సాంస్కృతిక సమాఖ్య 5వ వార్షికోత్సవ పోస్టర్లను సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మండవ మురళీ కృష్ణ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా గాయకుడు శరత్ ఆధ్వర్యంలో నిర్వహించే సంగీత విభావరిలో హైదరాబాద్‌కు చెందిన 30 మంది గాయనీ గాయకులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మేధావులు, విద్యావేత్తలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మండవ సాయి సుబ్బారావు, పర్వతనేని రామకృష్ణ ప్రసాద్, వేమగుంట జగదీష్ బాబు, కల్లం శ్రీధర్ రెడ్డి, జీఎన్‌వీ రత్నకుమార్, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్తీక దీప దర్శనానికి వెళ్లే భక్తులు జాగ్రతలు పాటించాలి

● ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: అరుణాచలంలో కార్తీక దీప దర్శనానికి వెళ్లే జిల్లాకు చెందిన భక్తులు అన్ని రకాల ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పలు సూచనలు చేశారు. తిరుపతి, చిత్తూరు రూట్ల నుంచి వెల్లూరు రోడ్డు మీదుగా తిరువణ్ణామలైకి వచ్చే ఏపీఎస్ఆర్టీసీ బస్సుల కోసం.. తిరువణ్ణామలై బైపాస్ రోడ్డు వద్ద దీపం నగర్ జంక్షన్ సమీపంలోని తాయ్ ముగాంబిక నగర్, ఏకేఎస్ నగర్ వద్ద రెండు ప్రత్యేక బస్టాండ్లను తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తిరుపతి, చిత్తూరు మార్గాల నుంచి వెల్లూరు రోడ్డు మీదుగా తిరువణ్ణామలైకి వచ్చే కార్ల కోసం వేలూరు రోడ్డులోనే 13 కార్ పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గిరివాలం మార్గంలో ఉన్న నీటి వనరుల్లోకి వెళ్లకుండా భక్తులు జాగ్రతగా ఉండాలని సూచించారు. అనుమతి లేకుండా అటవీ ప్రాంతాల్లోకి వెళ్లి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని హెచ్చరించారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే సమీపంలోని వైద్య శిబిరాల నుంచి వైద్య సహాయం పొందాలని, తిరువణ్ణామలై జిల్లా పోలీసు హెల్ప్‌లైన్ నంబర్ 9363622330కు వాట్సప్‌లో హాలో అని మెసెజ్ పెడితే తగిన సహాయం లభిస్తుందని వివరించారు. అలాగే తిరువణ్ణామలై క్రైం పోలీసు 04175-222303కి ఫోన్ చేసి సహాయం కోరవచ్చని ఎస్పీ దామోదర్ తెలిపారు.

ఎరువుల దుకాణాలపై కేసులు

కంభం: పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను బుధవారం రాత్రి విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. నిల్వలకు సంబంధించి ఒక దుకాణంలో రూ.1.86 లక్షలు, మరో దుకాణంలో రూ.72 వేల వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు కులశేఖర్, శివనాగ ప్రసాద్, రామారావు, వ్యవసాయాధికారి స్వరూప పాల్గొన్నారు.

చర్యలే గమ్మత్తు..!
జోరుగా మత్తు

నాడు
గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాల సంఖ్య తగ్గించడంతోపాటు బెల్టుషాపులు, నాటుసారా, గంజాయిపై అధికారులు ఉక్కుపాదం మోపారు. సారా తయారీదారుల్లో మార్పు తెచ్చేందుకు పరివర్తన కార్యక్రమాన్ని చేపట్టి సుమారు వంద మందికి పైగా వ్యక్తులను సాధారణ జీవనం గడిపేలా పోలీసులు చర్యలు చేపట్టారు. ఫలితంగా మహిళలు హాయిగా నిద్రపోయారు.

నేడు
ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులకు బెల్టు షాపులు ప్రధాన ఆదాయ వనరుగా మారాయి. అధికారులపై తరచూ ఒత్తిడి తీసుకొస్తుండటంతో వారు కూడా నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు. అడపా దడపా దాడులు చేస్తున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. మద్యం తాగి గొడవ చేసే వారితో గ్రామాల్లో ప్రజల మధ్య అశాంతి, అసహనం పెరిగిపోయాయి.


అర్ధవీడు మండలంలో నాటుసారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు



మార్కాపురం రూరల్ ఎస్సై స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం బాటిళ్లు

● పశ్చిమ ప్రకాశంలో ఊరూరా బెల్టు షాపులు
● బెల్టు బాబులకు కూటమి నేతల సహకారం
● జోరుగా సాగుతున్న గంజాయి వ్యాపారం
● అటవీ సమీప ప్రాంతాల్లో మొదలైన సారా బట్టీలు

మార్కాపురం:

పశ్చిమ ప్రకాశంలో ఒక వైపు గంజాయి విక్రయాలు, మరో వైపు బెల్టుషాపులు జోరుగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం నూతన పాలసీ పేరుతో మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టిన దరిమిలా గ్రామాల్లో బెల్టుషాపులు ఎక్కువయ్యాయి. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఇటీవల కాలంలో పోలీసులు బెల్టు షాపులపై దాడులు నిర్వహించి పలువురిని అదుపులోనికి తీసుకున్నప్పటికీ వాటి నిర్వహణ మాత్రం ఆగడం లేదు. మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు, బేస్తవారపేట, గిద్దలూరు తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో బెల్టుషాపులు జోరుగా నడుస్తున్నాయి. మరో వైపు అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కూడా మళ్లీ ప్రారంభమైంది. ఎక్సైజ్, పోలీసులు దాడులు నిర్వహిస్తున్నప్పటికీ అక్రమ మద్యం, నాటుసారా ప్రవాహానికి అడ్డుకట్ట పడలేదు. డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో గంజాయి వాడకం మళ్లీ ప్రారంభమైంది. ప్యాకెట్ రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు.

ఊరూరా బెల్టుషాపులు

మార్కాపురం మండలంలోని చింతగుంట్ల, తిప్పాయపాలెం, గజ్జలకొండ, బోడపాడు, దరిమడుగు, తర్లుపాడు మండలంలోని కేతగుడిపి, తర్లుపాడు, నాగెళ్లముడుపు, తుమ్మలచెరువు, గానుగపెంట, సీతానాగులవరం, పోతలపాడు, సూరేపల్లి, జగన్నాధపురం, కొనకనమిట్ల మండలంలోని మునగపాడు, సలనూతల, చిన్నారికట్ల, కాట్రగుంట, వాగుమడుగు, సిద్ధవరం, గార్లదిన్నె తదితర గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేశారు. పొదిలి మండలంలో అక్కచెరువు, సూదనగుంట, ఆముదాలపల్లి, అన్నవరం, మల్లవరం, మూగచింతల, సలకనూతల, అలాగే పొదిలి టౌన్‌లోని వివిధ ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు సాగుతున్నాయి. గిద్దలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మూడొంతుల గ్రామాల్లో బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి గుట్టుగా మద్యం విక్రయిస్తున్నారు. బస్టాండ్లు, జన సమూహం అధికంగా ఉండే ప్రాంతాల్లో మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నారు కానీ బెల్ట్ షాపులను మాత్రం కట్టడి చేయలేకపోతున్నారు. గ్రామాల్లో కూటమి నేతల అండతో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వ్యక్తులను కాకుండా, సొంతగా మద్యం విక్రయిస్తున్న వారిపైనే పోలీసులు దృష్టి సారిస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్దారవీడు, పుల్లలచెరువు, దోర్నాల మండలాల్లో సారా బట్టీలు నడుస్తున్నాయి. ఇటీవల సారా బట్టీలను ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేయడమే అందుకు నిదర్శనం.

నవంబరు 26న అర్ధవీడు మండలం పాపినేనిపల్లి సమీపంలోని ఇందిరానగర్ చెంచుకాలనీలో బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. నవంబరు 27న గిద్దలూరులో ఎ వ్యక్తిని అదుపులోనికి తీసుకుని 15 క్వార్టర్లు, 24న కొనకనమిట్ల మండలం మునగపాడులో ఓ వ్యక్తి వద్ద నుంచి 23 క్వార్టర్లు, 23న గిద్దలూరు మండలం ఉయ్యాలవాడలో ఓ మహిళ వద్ద 30 క్వార్టర్లు, అదే రోజు మార్కాపురం పట్టణంలోని శివాలయం వద్ద 21 క్వార్టర్లు, 22న మార్కాపురం మండలం బిరుదుల నరవ వద్ద 30 క్వార్టర్లు, 6న బేస్తవారపేట జంక్షన్ వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి 23 క్వార్టర్లు, 5న అర్ధవీడు మండలం కాకర్ల డ్యామ్ సమీపంలో ఓ వ్యక్తి నుంచి అక్రమ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. గత నెలన్నర రోజులుగా గ్రామరాశి రుసుం కట్టి మద్యం విక్రయాలు సాగిస్తున్న వ్యవహారం పోలీసులకు తెలిసినా వారి వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలొస్తున్నాయి. కూటమి నేతల సహకారంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఒక్క బెల్ట్ షాప్‌పైనా చర్యలు తీసుకునేందుకు పోలీసులు సాహసించడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.


గంజాయి ప్యాకెట్

ఆగని గంజాయి విక్రయాలు

మార్కాపురం పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. పల్నాడు, రాయలసీమ జిల్లాల నుంచి గంజాయిని తెచ్చి ఒక్కో ప్యాకెట్ 200 రూపాయలకు అమ్ముతున్నారు. పూల సుబ్బయ్య కాలనీ, ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో కొంతమంది గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం. సెప్టెంబరు 2న పెద్దారవీడు మండలం హనుమాన్ జంక్షన్ వద్ద ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి 39 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు తెలంగాణ నుంచి మార్కాపురానికి గంజాయి తీసుకొచ్చినట్టు పోలీసుల విచారణలో తేలింది. అలాగే సెప్టెంబర్ 22న మార్కాపురం శివారులోని గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద ముగ్గురిని అరెస్టు చేసి 20.4 కిలోల గంజాయిని సీజ్ చేశారు. అయినప్పటికీ మార్కాపురంలో గంజాయి విక్రయాలు సాగుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో పోలీసులు క్షేత్ర స్థాయిలో గంజాయి విక్రేతలపై నిఘా ఉంచాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బెల్టుషాపులపై కఠిన చర్యలు



మార్కాపురం డివిజన్‌లో బెల్టుషాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే బెల్టుషాపుల నిర్వాహకులపై పలుచోట్ల కేసులు నమోదు చేశాం. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలి. ఎక్కడైనా బెల్టుషాపు ఉన్నట్లు తెలిస్తే మాకు సమాచారం అందించండి. వారి పేర్లు రహస్యంగా ఉంచుతాం.
– డి బాలయ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, మార్కాపురం

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య



పెదకాకాని: చెట్టుకు ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం అగతవరప్పాడు ఏరియాలోని ఇన్నర్‌రింగ్ రోడ్డు సమీపంలో జరిగింది. వివరాల్లోకి పెదకాకాని మండలంలోని అగతవరప్పాడు పరిధిలో ఇన్నర్ రింగ్ రోడ్డు పక్కనే యువకుడు మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడు ప్రకాశం జిల్లా పెదదోర్నాలకు చెందిన దండా శ్రీనివాసరెడ్డి(24)గా గుర్తించారు. మృతునికి వివాహం కాలేదు. ఇన్నర్‌రింగ్ రోడ్డు పక్కనే ఉన్న వేపచెట్టుకు మంగళవారం రాత్రి కేబుల్ వైర్లతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని, ఆ తరువాత కొద్దిసేపటికి ఆ వైర్లు తెగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు. మృతుని తండ్రి వెంకట్రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు. మృతుడు చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ వరకూ చదువుకుని ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. ప్రేమ విఫలం కారణంగానే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శి అత్యుత్సాహం ..!

● పొలాలకు వెళ్లే దారిని పొక్లెయిన్‌తో గుంతలు తవ్వించిన కార్యదర్శి
● అడ్డుకున్న రైతులు, చెరుకూరు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు
● గతంలో కూడా బండిదారిలో వెళ్లకుండా రైతులను అడ్డుకున్న కార్యదర్శి
● హైకోర్టును ఆశ్రయించిన రైతులు బండిదారి జోలికి వెళ్లవద్దని ఇటీవల ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు
● కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తూ గుంతలు తవ్వించిన కార్యదర్శి


రైతు పొలాలకు వెళ్లడానికి బండిదారి స్థలంలో రోడ్డును బాగుచేసిన దృశ్యం


కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తూ బండిదారి బాటలో గుంతలు తవ్విస్తున్న కార్యదర్శి

పొన్నలూరు:

గ్రామ పంచాయతీ కార్యదర్శి అత్యుత్సాహం, చేష్టలతో చెరుకూరులో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక టీడీపీ నాయకులు చెప్పారంటూ పొలాలకు వెళ్లే బండిదారిని పొక్లెయిన్‌తో పెద్ద పెద్ద గుంతలు తవ్వించడంతో స్థానిక రైతులు ఆదోళనకు దిగారు. గ్రామంలోని బండిదారి జోలికి వెళ్లవద్దని కోర్టు ఆదేశించినా..టీడీపీ నాయకులు చెప్పిన మాటలే తనకు వేదవాక్కు అనే సిద్ధాంతంతో విధులను మరిచి గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడానికి కారణమయ్యాడు..వివరాలు పరిశీలిస్తే మండలంలోని చెరుకూరు గ్రామ పంచాయతీ సర్వే నంబర్ 1204లో బండిబాట దారి ఉంది. ఈ బండిబాట దారికి పై ఎత్తున సర్వే నంబర్ 1185తో పాటు మరికొన్ని సర్వే నంబర్లలో గ్రామానికి చెందిన రైతులకు సంబంధించి సుమారుగా 60 ఎకరాల పొలాలు ఉన్నాయి. ఈ పొలాలకు వెళ్లేందుకు రైతులు మట్టి తోలి రాకపోకలు సాగించడానికి ఇబ్బంది లేకుండా చేశారు. అయితే ఇది ఓర్చుకోలేని స్థానిక టీడీపీ నాయకులు కావాలనే దురుద్దేశంతో మంత్రి స్వామి ద్వారా పంచాయతీ కార్యదర్శికి చెప్పించారు. దీంతో కార్యదర్శి పంచాయతీకి చెప్పకుండా బండిదారి బాటను ఎలా బాగుచేస్తారని రైతుకు నోటీసు ఇచ్చారు. అలాగే బండిదారి స్థలంలో ఇళ్ల పట్టాలు ఇప్పిస్తున్నామని, రైతులు బాగుచేసిన రోడ్డును, తూములను తీసివేయించాలని టీడీపీ నాయకులు కార్యదర్శిని పురమాయించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి రైతులను బెదిరించి మరో సారి నోటీసులు ఇచ్చి సంజాయిషీ ఇవ్వాలని కోరాడు.

కోర్టు ఆదేశించినా..

పంచాయతీ కార్యదర్శి తీరుపై అక్టోబర్‌లో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు స్థానిక తహసీల్దార్‌ను వివరణ అడగగా రెవెన్యూ రికార్డుల ప్రకారం బండిదారిగా ఉందని, ఈ స్థలంలో ఎలాంటి ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని, మున్ముందు కూడా బండిదారి స్థలంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి వీలులేదని తెలియజేశారు. తహసీల్దార్ వివరణపై సంతృప్తి చెందిన కోర్టు బండిదారి ప్రస్తుతం ఎలా ఉందో అలాగే ఉంచాలని బండిదారి జోలికి వెళ్లకూడదంటూ నవంబర్ నెలలో ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తహసీల్దార్‌తో పాటు మరి ఏ అధికారి కూడా బండిబాట జోలికి వెళ్లలేదు. అయితే గ్రామస్తుల ఆందోళనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో గ్రామానికి చేరుకున్న పోలీసులు పొక్లెయిన్‌ను అడ్డుకుంటే కేసులు పెడతామని బెదిరించారు. కోర్టు ఆదేశాలతో ఉన్నతాధికారులు కిమ్మనకుండా ఉన్నా పంచాయతీ కార్యదర్శి మాత్రం అధికార పార్టీకి కొమ్ముకాసి గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడానికి కారణమవడంతో గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేశారు. ఇదిఇలా ఉంటే ఇదే బండిదారి స్థలాన్ని స్థానిక టీడీపీ నాయకులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేయడం కొసమెరుపు.

మహిళ హత్య కేసు..
నిందితుడికి జీవిత ఖైదు

ఒంగోలు: మహిళ హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చీమకుర్తి మండలం గాడిపర్తివారిపాలేనికి చెందిన నాగులూరి యాకోబు తన స్వగ్రామంలోనే చీమకుర్తికి చెందిన మద్యాన్నపు లక్ష్మి అనే మహిళతో ఏడాదికాలంగా సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యం తాగి ఆమెతో తరచూ గొడవపడుతుండేవాడు. ఆమెపై అనుమానం కూడా పెంచుకున్నాడు. 2020 ఫిబ్రవరి 22న రాత్రి మద్యం మత్తులో ఉన్న యాకోబు.. లక్ష్మి తలపై కర్రతో కొట్టి హతమార్చాడు. దీనిపై అప్పటి రూరల్ సీఐ పి.సుబ్బారావు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి నేరం నిరూపణ అయినట్లు పేర్కొంటూ నిందితుడికి జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచిన అప్పటి రూరల్ సీఐ పి.సుబ్బారావు, చీమకుర్తి ఏఎస్సై ఎం.వీరాస్వామి, కోర్టు లైజన్ హెడ్ కానిస్టేబుల్ వి.రాఘవరావు, ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.వసుంధరను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు హల్‌చల్

● ఒకేసారి 8 ట్రాన్స్‌ఫార్మర్లలో వైర్లు అపహరణ
● లబోదిబోమంటున్న రైతులు



మర్రిపూడి, గుండ్లసముద్రంలో అపహరణకు గురైన రాగివైరును పరిశీలిస్తున్న ఏఈ సుబ్బారెడ్డి

మర్రిపూడి: మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు హల్‌చల్ చేశారు. వ్యవసాయ బోర్లకు అనుసంధానంగా ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌లను రాత్రి సమయంలో పగులకొట్టి అందులో ఉన్న విలువైన రాగివైరును అపహరించారు. ఒకేరోజు 8 ట్రాన్స్‌ఫార్మర్లు అపహరణకు గురైన సంఘటన మర్రిపూడి, పొదిలిలో మంగళవారం రాత్రి జరిగాయి. బాధితుల తెలిపిన వివరాల మేరకు..మండలంలోని గుండ్లసముద్రం గ్రామశివారులోని జాళ్లవాగు వద్ద కుంటముక్కల సతీష్, కిరణ్‌కుమార్‌లకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్, అలాగే మర్రిపూడికి చెందిన సూరే వెంకయ్యకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మండే తిరుపతయ్యకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్, రాజుపాలెం గ్రామానికి చెందిన భూన వెంకటరెడ్డికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్, పొదిలికి చెందిన మరో నలుగురు రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి అందులోని రాగివైర్లు దొంగిలించారు. విద్యుత్ సరఫరా అవుతున్నా కూడా వైర్లు కట్‌చేసి, ట్రాన్స్‌ఫార్మర్లు కిందకు దించి పగులకొట్టి అందులో ఉన్న రాగివైరును తీసుకెళ్లినట్లు రైతులు తెలిపారు. 20 కేవీ, 16 కేవీ విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్‌లు అపహరణకు గురికావడంతో ఆయా గ్రామాల రైతులు లబోదిబోమంటున్నారు. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ ఏఈ ఏ సుబ్బారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని రైతులను విచారించారు. ట్రాన్స్‌ఫార్మర్ల కింద సాగు చేసిన వరి, మిరప, పొగాకు, కంది తదితర పంటలకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు.

ప్రకృతి వ్యవసాయ ఆహారంతో ఆరోగ్యం


టంగుటూరు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలిస్తున్న ఏపీఎఫ్ టీం, రాష్ట్ర బృందం

టంగుటూరు: మండలంలోని కందులూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగవుతున్న వరి, మినుము క్షేత్రాలను సోమవారం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి ఆధ్వర్యంలో ఏపీఎఫ్ టీం సభ్యులు అన్వర్, హేమ, రాష్ట్ర బృందం సభ్యులు మురళి, ప్రవీణ్, కిషోర్ సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిస్తున్న మోడల్స్, పంట పొలాలను పరిశీలించారు. సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తెల్లా త్రివేణి ఏటీఎం మోడల్ ను పరిశీలించి వారు చేస్తున్న మోడల్, ఆచరిస్తున్న పద్ధతుల గురించి, వారు ఇప్పటి వరకు ఎంత ఆదాయం పొందారు అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో రైతులు కరాల బ్రహ్మయ్య, శాంతి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న సొర, గుమ్మడి, కంది పంటలో అంతర పంట దోసను పరిశీలించి, వారి నుంచి దిగుబడి, ఆదాయం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జ్ విజయలక్ష్మి మండలంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి, ఆదాయం, దిగుబడి, ఇతర అంశాల గురించి ఏపీఎఫ్ సభ్యులకు వివరించారు. కందులూరు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామంలోని రైతులతో ఏపీఎఫ్ టీం అన్వర్, హేమ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి సేద్యం బాగుందని, రాబోయే రోజుల్లో ప్రకృతి వ్యవసాయమే ముఖ్యమైనది అవుతుందని చెప్పారు. రసాయన వ్యవసాయం కంటే ప్రకృతి సేద్యం తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం తో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తుందన్నారు. ప్రతి రైతు ఈ ప్రకృతి వనరుల కేంద్రంలోని ఘన జీవామృతం, ద్రవ జీవామృతం ఉత్పత్తులను, కషాయాలను వినియోగించుకోవడం ద్వారా రైతులకు పెట్టుబడులు తగ్గించుకోవడంతో పాటు నాణ్యమైన విషరహిత ఉత్పత్తుల లభిస్తాయన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు విజయలక్ష్మి, వెంకట్రావు, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

● దేవదాయ శాఖ ఏసీ పానకాలరావు


ఆక్రమణలకు గురైన ఆలయ భూములపై ఈఓతో చర్చిస్తున్న ఎన్‌డోమెంట్ ఏసీ

పామూరు: దేవాలయ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దేవదాయ శాఖ ఏసీ ఎం పానకాలరావు హెచ్చరించారు. పామూరులో సర్వేనంబర్ 329/2,3, 442/1,2,3 లలోని మదన వేణుగోపాలస్వామి, వల్లీసమేత భుజంగేశ్వరస్వామి దేవాలయ భూముల్లో ఆక్రమణలను బుధవారం ఆయన ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబుతో కలిసి పరిశీలించారు. తక్షణం ఆక్రమణలను తొలగించి భూములు ఆలయాలకు చెందేలా చూడాలని ఆదేశించారు. అలాగే స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి మఠం, అనుమలశెట్టి సత్రం ఆస్తులను పరిశీలించారు. వీటిపై ఈఓగా నరసింహబాబుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా వీటికి సంబంధించిన ఆస్తులు, ఆదాయాలను విచారించి నివేదికను పంపాలని ఎండోమెంట్ కందుకూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ, ఈఓ నరసింహబాబులను ఏసీ ఆదేశించారు. గుర్రం వెంకటేశ్వర్లు, బండ్ల నారాయణ, సిద్దవటం నరసింహులు, పలువురు పాల్గొన్నారు.

రెస్టారెంట్ యజమానిపై బీరు సీసాతో దాడి


చికిత్స పొందుతున్న రామాంజనేయులు

దర్శి: 'రెస్టారెంట్ మూసే సమయం దాటింది. త్వరగా బిల్లు చెల్లించి వెళ్లాల'ని కోరిన రెస్టారెంట్ యజమానిపై ఇద్దరు యువకులు దాడి చేయడంతో పాటు బీరు సీసా పగలగొట్టి పొడిచారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి దర్శి మండలం చలివేంద్ర గ్రామ సమీపంలోని గోల్డెన్ రెస్టారెంట్‌లో చోటుచేసుకుంది. ఎస్సై కథనం మేరకు.. మలసాని అశోక్, బేళ్ళ రామాంజి, మరో వ్యక్తి కలిసి మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో రెస్టారెంట్‌లో మద్యం తాగుతున్నారు. సమయం మీరిపోయిందని, బిల్లు చెల్లించాలని రెస్టారెంట్ యజమాని రామాంజనేయులు కోరగా మద్యం మత్తులో ఉన్న యువకులు వాగ్వివాదానికి దిగారు. అశోక్ అనే వ్యక్తి కుర్చీని విసరడంతో రామాంజనేయులు తలకు తగిలి గాయమైంది. అదే సమయంలో వ్యక్తి బీరు సీసా పగలగొట్టి రామాంజనేయులు పొట్టలో పొడిచాడు. క్షతగాత్రుడిని రెస్టారెంట్ సిబ్బంది తొలుత దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.